andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 • కనిష్ఠం 15.9
నిర్మల్ జిల్లా వార్తలు
6
గురువారం 23 జనవరి 2025



మైనార్టీ గురుకులాల్లో
ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఐదవతరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాథోడ్ సుజాత తెలిపారు. మైనారిటీలకు 30 ఇతరులకు 10 సీట్లు రిజర్వేషన్ కోటాలో ఉంటుందని తెలిపారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7331170838 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

త్వరలో అధికారుల చేతుల్లోకి
పాలన పగ్గాలు



- ఈ నెల 26తో ముగియనున్న మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం
- ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవడంతో ఇక అధికారుల చేతుల్లోకి మున్సిపల్ పాలన
- జిల్లాలో పదవిని కోల్పోనున్న మూడు మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు
- ఇప్పటికిప్పుడు మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగకపోవచ్చని జోరుగా ప్రచారం
- మరో ఐదు నుంచి ఆరు నెలల పాటు అధికారుల కనుసన్నల్లోనే బల్దియా పాలన
- ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నువ్వా.. నేనా అన్నట్లు తలపడేందుకు సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలు

ఖానాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మూడు మున్సిపాలిటీలలో మరో నాలుగు రోజుల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగేంత వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న వనరులతో తమ హయాంలో చేయాల్సిన పనులను పూర్తి చేసుకుంటే రానున్న ఎన్నికల్లో తమకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్న పాలకవర్గ సభ్యులు అభివృద్ధి పనులను వేగవంతం చేశారని చెబుతున్నారు. ఇప్పటికే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల పదవీకాలాలు ముగియడంతో గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లలో ఇప్పటికే ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇక ఈ నెల 26వ తేదీకి మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో 27వ తేదీ నుండి ప్రత్యేక అధికారుల పాలన జాబితాలో మున్సిపాలిటీలు కూడా చేరనున్నాయి.

ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవడంతో అధికారుల చేతుల్లోకే పట్టణ పాలన

ఈ నెల 26వ తేదీతో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై ఎటువంటి ఎన్నికల నోటిఫికేషన్ రాకపోవడంతో పట్టణపాలన ఇక అధికారుల చేతుల్లోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా తొలత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల ఓటరు తుది జాబితా సైతం విడుదల చేసినప్పటికీ రిజర్వేషన్లపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రభుత్వం ఇటీవల బీసీల రిజర్వేషన్లు పెంచేందుకు నిర్ణయించి కులగణన సర్వేను సైతం పూర్తి చేసింది. ఈ ప్రక్రియ ఇదివరకే పూర్తయిన నేపథ్యంలో బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ప్రకటన చేసిన వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతుంది. దీంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో పంచాయతీ ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని ఓ పక్క రాజకీయ నాయకులు, మరోపక్క అధికారులు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలతో పాటు వరుసగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను నిర్వహిస్తారని చెబుతున్నారు. ఈ ఎన్నికలు ముగిసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకావం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అటు మరో నాలుగు రోజుల్లో పదవులు కోల్పోనున్న మున్సిపల్ పాలకవర్గాల సభ్యులు మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదివరకే గ్రామ పంచా యతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ నుండి మున్సిపాలిటీల పరిధిలో సైతం ఏర్పాటు కానున్న ప్రత్యేక అధికారుల పాలనపై పలువురు పెదవి విరుస్తు న్నారు. ప్రత్యేక అధికారులు ప్రజా సమస్యలను ఏ మేరకు పరిష్కరిస్తారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఐదేళ్ల కాలంలో నిర్మల్, ఖానాపూర్‌లో నాటకీయ పరిణామాలు

నిర్మల్ జిల్లాలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీలలో భైంసా మినహా నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలో పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. గత మున్సిపాలిటీ ఎన్నికల్లో భైంసా మున్సిపాలిటీని ఎంఐఎం కైవసం చేసుకోగా నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీలను బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్నంతవరకు నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు కొనసాగారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు మున్సిపాలిటీలలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీకి తొలి చైర్మన్‌గా ఎన్నికైన అంకం రాజేందర్‌ను రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అవిశ్వాసంతో గద్దె దింపారు. గత ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఖానాపూర్ మున్సిపాలిటీలో చైర్మన్, వైస్ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో కౌన్సిలర్లు నెగ్గారు. దీంతో గత ఏడాది 28వ తేదీ ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ చిన్నం సత్యనారాయణ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్ కావలి సంతోష్ ఎన్నికయ్యారు. తర్వాత జరిగిన నాటకీయ పరిణామాలలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇక నిర్మల్ మున్సిపాలిటీలో సైతం బీఆర్ఎస్ నుంచి చైర్మన్‌గా ఎన్నికైన గండ్రత్ ఈశ్వర్ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన వెంటనే కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. ఇలా గత ఐదేళ్ల కాలంలో జిల్లాలోని భైంసా మినహా రెండు మున్సిపాలిటీల పరిధిలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

మున్సిపల్ ఎన్నికలపై ప్రధాన రాజకీయ పార్టీల దృష్టి

నిర్మల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అధికారం చేజిక్కించుకోవాలని రాజకీయ పార్టీలు తహ తహలాడుతున్నాయి. నిర్మల్, ఖానాపూర్ మున్సిపాలిటీలలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీల అభ్యర్థులు నువ్వా నేనా అన్నట్లుగా పోటీకి సిద్ధమవుతున్నారు. అధికార పార్టీ సెంటిమెంట్ తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ అభ్యర్థులు, హిందుత్వవాదంపై బీజేపీ అభ్యర్థులు, ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ అభ్యర్థులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కాగా భైంసా మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం మున్సిపల్ పీఠం దక్కించుకున్న ఎంఐఎంతో పాటు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడేందుకు సిద్ధమవుతున్నాయి. మొత్తానికి ఈ నెల 26తో ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ప్రస్తుతం పదవుల్లో ఉన్న చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లతో సహా ఐదేళ్లగా ఆయా పార్టీలలో ఆశవాదులుగా ఉన్న అభ్యర్థులంతా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. కానీ వీరంతా మరో ఐదు నుంచి ఆరు నెలల పాటు వేచి చూడక తప్పదనే అభిప్రాయలు వినిపిస్తున్నాయి.



ఖానాపూర్‌లోని మున్సిపల్ కార్యాలయం

రోడ్డు పనులను పరిశీలించిన డీఈఈ


రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ

ముథోల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ నుంచి వటోలి వరకు సుమారు రూ. 30 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను భైంసా డివిజన్ ఆర్ అండ్ బి డీఈఈ సునీల్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నిర్మిస్తున్న రోడ్డుకు కొలతలు చేపట్టారు. రోడ్డుపై అక్కడక్కడ నిర్మిస్తున్న కల్వర్టులను పరిశీలించారు. రోడ్డు పనులు మరింత వేగాన్ని పెంచి వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు పనులను నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

వలస కార్మికుల
సమస్యలపై జాతీయ సదస్సు

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాష్ట్రంలోని కొట్టాయంలో ఈ నెల 25, 26 తేదీల్లో వలస కార్మికుల సమస్యలపై జాతీయ వర్క్‌షాప్‌కు తెలంగాణ రాష్ట్రం నుంచి ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో వలస కార్మికులతో ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి పరిష్కరించడానికి ఈ వేదికను ఉపయోగిస్తామని తెలిపారు.

రేపు వాహనాల వేలం

భైంసా రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో జప్తు చేసిన వాహనాలను జిల్లా అధికారి అబ్దుల్ రజాక్ ఆదేశాల మేరకు శుక్రవారం వేలం నిర్వహిస్తామని సీఐ నజీర్‌హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. భైంసాస్టేషన్‌లో ఈ నెల 24వ తేదీన జప్తు చేసిన వాహనాల వేలంపాటను నిర్వహిస్తారు. ఆసక్తి గలవారు రూ. 50 రుసుము చెల్లించి ఈ వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ముథోల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లోని రవీంద్ర ఉన్నత పాఠశాలలో బుధవారం అహల్య బాయి హోల్కర్ 3వ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇంపాక్ట్ మోటివేషన్ స్పీకర్లు చల్లా శ్రీధర్‌రెడ్డి, పెరుమాల శ్రీనివాసు, వకులాభరణం శ్రీధర్‌రెడ్డి, చక్రి, పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

గౌడ సంఘం
కులస్థులు సంఘటితం కావాలి

కుభీర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రానున్న సంస్థాగత ఎన్నికల్లో గెలుపొందేందుకు గౌడ సంఘ కులస్థులు సంఘటితం కావాలని గౌడ సంఘం జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ కనకగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు దేవేందర్‌గౌడ్, బాలగౌడ్, రమేష్‌గౌడ్, తదితరున్నారు.

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి

• జిల్లా న్యాయాధికారి ఏ.కర్ణకుమార్

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఒత్తిళ్లను తగ్గిస్తాయని జిల్లా న్యాయాధికారి ఏ.కర్ణకుమార్ అన్నారు. బుధవారం ఆయన కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంగో గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడలను కోర్టు ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ... కోర్టు వ్యవహారాల్లో బిజీగా ఉండే న్యాయవాదులకు క్రీడల్లో పాల్గొంటే ఉపశమనం, ఉల్లాసం కలుగుతుందన్నారు. అలాగే ఆరోగ్యాన్ని కలిగిస్తాయని, క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికీ ఈ పోటలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్‌కుమార్, గవర్నమెంట్ ప్లీడర్ బి. శుభకరణ్, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వి.మహేందర్, ఉపాధ్యక్షులు కవిత, లైబ్రరీ సెక్రటరీ సిహెచ్. అర్చన, స్పోర్ట్స్ సెక్రటరీ వంశీ, న్యాయవాదులు శ్యాంసుందర్‌రెడ్డి, నూనె గంగాధర్, వివి. రమణరావు, పి.నవీన్, ఎస్.నరేందర్, కొమ్మోజి రమణ, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.


క్యారంబోర్డు ఆడుతున్న జిల్లా న్యాయాధికారి

అధిక నిధులు కేటాయించి మండలాన్ని అభివృద్ధి చేస్తా

• సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనోత్సవంలో బీజేపీ శాసనసభా పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


మునిపెల్లిలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

లక్ష్మణచాంద, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : అధిక నిధులు తెచ్చి మండలాభివృద్ధికి కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే బీజేపీ శాసన సభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం అన్నారు. మండలం మొత్తం మీద రూ.1.12 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో 3.36 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పీచరలో 6.5 లక్షలతో, ధర్మారంలో 7.50 లక్షలతో, బాబాపూర్‌లో 5 లక్షలతో, మల్లాపూర్‌లో 11 లక్షలతో, లక్ష్మణచాందలో 11 లక్షలతో, చామన్‌పెల్లిలో 5 లక్షలతో, బోరిగాంలో 5 లక్షలతో, మాచాపూర్‌లో 1.50 లక్షలతో, రాచాపూర్‌లో 3.50 లక్షలతో, కనకాపూర్‌లో 5.20 లక్షలతో, చింతల్‌చందాలో 10 లక్షలతో, వడ్యాల్‌లో 15 లక్షలతో, తిరుపెల్లిలో 5 లక్షలతో, పార్‌పెల్లిలో 9 లక్షలతో, వడ్యాల్ తండాలో 3 లక్షలతో, మునిపెల్లిలో 10 లక్షలతో నిర్మించనున్న ఈ సీసీ రోడ్లుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మునిపెల్లిలో ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, అయిండ్ల భూపాల్ రెడ్డి, అడ్వాల రమేష్, సురకంటి ముత్యంరెడ్డి, తిరుపెల్లి చిన్నయ్య, వేణుగౌడ్, నూతికాడి రాజారెడ్డి, చిద్దు భీమ్ రెడ్డి, కమల్‌కోట వెంకట్‌రెడ్డి, అడిచెర్ల రవికుమార్, ఓస రాజు, శెవ్వ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో


వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఈవో

ముథోల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పదవతరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. మండలంలోని ఆష్ట, బోరిగాం గ్రామాల్లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా చదువు పైన దృష్టి సారించాలని పేర్కొన్నారు. అమ్మ నాన్న కన్న కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం వంటలను పరిశీలించారు. అలాగే ఆష్ట ప్రాథమిక పాఠశాలతో పాటు మండలంలోని గన్నేర పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం భోజనం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రమణారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

'రోడ్డు భద్రత'ను ప్రతి ఒక్కరూ పాటించాలి

సారంగాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుభద్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్టీవో దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలో గల చించోలి(బి) సమీపంలోని ఆర్టీవో కార్యాలయంలో వాహనాల యజమానులు, డ్రైవర్‌లతో అవగాహన సదస్సు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాహనాలపై వెళ్లే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, భద్రత నియమాలను పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ప్రయాణం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు మహేందర్, మార్తుజా అలీతో పాటు సిబ్బంది, వాహనదారులు, డ్రైవర్లు ఉన్నారు.



వాహనదారులు, డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీవో

లింబా(కె)లో హిందూవాహిని జెండా ఆవిష్కరణ


జెండా ఆవిష్కరిస్తున్న హిందూ వాహిని నాయకులు

కుంటాల, జనవరి, 22 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింబా (కే) గ్రామంలో బుధవారం హిందూవాహిని ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హిందూ వాహిని నాయకులు చింతపండు మహేష్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు హిందూ ధర్మం రక్షణ కొరకు పాటుపడుతూ హిందూ దేవాలయాలను గోమాతలను, హిందూ మహిళలను రక్షించుకోవాలన్నారు. సనాతన ధర్మమైన హిందూ ధర్మాన్ని ప్రతి ఒక్కరు పాటించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, చిన్న రాజన్న, పూస కమల్, కుంటాల మండల అధ్యక్షుడు సిందే దిగంబర్, సిందే సాయికుమార్, ఆకాష్ గౌడ్, మహేష్, వినాయక్, సాయి, హిందూవాహిని కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా అయోధ్య వార్షికోత్సవం


గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కుంటాల, జనవరి, 22 : (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో బాలరాముని విగ్రహాన్ని ప్రతిష్టించి ఏడాది గడిచిన సందర్భంగా మండలంలోని లింబా (కే) గ్రామంలో బుధవారం స్థానిక హనుమాన్ ఆలయంలో గౌరీ పూజ, గణపతి పూజ, కళశ పూజ, నవగ్రహ పూజ, అభిషేకం, రాముని విగ్రహానికి జలాభిషేకం, పాలాభిషేకం, పుష్పాభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించి గ్రామం ప్రధాన వీధుల గుండా మహిళలు మంగళ హారతులతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ అశోక్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, సొసైటి డైరెక్టర్ గోనె గజ్జారాం, మాజీ ఎంపీటీసీ ముత్యం సునంద గిరీష్, గ్రామస్థులు ముత్యంరెడ్డి, దత్తురాం పటేల్, శ్రీకర్‌రెడ్డి, మల్లారెడ్డి, నరేష్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● గ్రామసభల్లో ప్రశ్నల వర్షం కురిపించిన ప్రజలు ● ఓపికగా సమాధానాలు ఇచ్చిన అధికారులు



అందకూర్ గ్రామంలో గ్రామసభలో పాల్గొన్న డీపీవో

కుంటాల, జనవరి, 22 : (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని లింబా (కే), అందకూర్, సూర్యాపూర్, దౌనెల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ నెల 26వ తేదీ నుండి ప్రభుత్వం ప్రారంభించబోతున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులు, రైతు భరోసాలో లబ్దిదారుల వివరాలను చదివి వినిపించారు. ప్రస్తుతం పథకంలో లబ్దిదారులుగా ఎంపిక కాని అర్హులు దరఖాస్తు చేసుకుంటే రాబోయే రోజుల్లో వారికి పథకాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ, వార్డుసభల్లో భాగంగా బుధవారం పట్టణలోని ఆస్రా కాలనీలో నిర్వహించిన వార్డు సభలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అన్వర్ పాషా, వార్డు ఆఫీసర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భైంసా రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోతుల్‌గాం గ్రామంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సభలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు ప్రతి ఒక్కరికి అందుతాయన్నారు. కొత్త రేషన్ కార్డులు ఎంపిక కాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ యోగ్య భూమికి రైతు భరోసా వర్తిస్తుందన్నారు. కొండలు, గుట్టలు, రాళ్ల రప్పలు లే అవుట్ భూములకు రైతు భరోసా వర్తించదని తెలిపారు. రేషన్ కార్డు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, టి.శ్రీధర్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ సాయినాథ్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముథోల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. రెండవ రోజైన బుధవారం మండలంలోని తరోడా, కారేగాం, బ్రహ్మన్‌గాం, గన్నోర, ఎడ్‌బిడ్ తండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అర్హులైన



దరఖాస్తులను పరిశీలిస్తున్న నిర్మల్ మున్సిపల్ చైర్మన్

లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. అయితే తరోడా గ్రామసభలో గ్రామస్తులు రేషన్ కార్డు జాబితాలో అర్హులైన పేర్లు రాలేదని అధికారులను ప్రశ్నించారు. దీంతో తహసీల్దార్ శ్రీకాంత్ వచ్చి చెప్పాలని గ్రామస్తులు తెలపడంతో తహసీల్దార్ గ్రామసభకు వచ్చి దాదాపు అర్హులైన వారి పేర్లు వచ్చాయని సాంకేతిక లోపంతో ఏమైనా కొందరి పేర్లు రాకుంటే ఆందోళన చెందవద్దన్నారు. గ్రామ పంచాయతీలో మూడు రోజులు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నామని, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బ్రహ్మన్‌గాం గ్రామసభకు ప్రత్యేక అధికారి డీఈవో రామారావు హాజర



మల్లాపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

య్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివ కుమార్, ఏవో రచన, ఏపీవో శిరీష రెడ్డి, ఎంఈవో రమణారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఏఈవోలు, రెవెన్యూ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కోతుల్‌గాం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాలుగు పథకాలు పూర్తిగా అమలు చేస్తారా ?

లక్ష్మణచాంద, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : 2 లక్షల రుణమాఫీ పథకాన్ని పూర్తిగా అమలు చేయనే లేదని ఈ నాలుగు పథకాలను పూర్తిగా అమలు చేస్తారా..? అని బుధవారం జరిగిన గ్రామసభలలో అధికారులను ప్రశ్నించారు. మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్, నర్సాపూర్(డబ్ల్యూ), న్యూ కంజర్, పార్‌పెల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలలో కొన్నిచోట్ల అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ కమిటీలను ఎవరికి సమాచారం లేకుండా చేశారని, ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయిన వారి పేర్లు గ్రామసభలో చదివిన జాబితాలో లేకుండా పోయాయని ఆరోపించారు. పేర్లు మిస్ కావటం వెనుక ఎవరి హస్తం ఉందని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన అధికారులు సమాధానమిస్తూ జాబితాలో పేర్లు లేని వారు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న తీసుకుంటామని శాంతింపజేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు గాని, ఇందిరమ్మ ఇళ్లు గాని, రైతు భరోసా గాని, రైతు ఆత్మీయ భరోసా గాని తప్పకుండా వస్తాయని హామీ ఇచ్చారు. పై నాలుగు పథకాల కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ఎంపీడీవో రాథోడ్‌రాధా, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏఈలు అంజనేశ్వర్, మధుకర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు



కోలూర్ గ్రామ సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పాల్గొన్నారు.

అనర్హులుంటే నిర్భయంగా చెప్పండి

దిలావర్‌పూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాల అర్హుల జాబితాలో ఎవరైనా అనర్హుల పేర్లు ఉంటే గ్రామసభలో తెలుపాలని ఎంపీడీవో అరుణరాణి అన్నారు. బుధవారం బన్సపల్లి, కంజర్, సాంగ్వి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. బన్సపల్లిలో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడారు. పారదర్శకంగానే లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, పొరపాటున అనర్హుల పేర్లు జాబితాలో ఉంటే గ్రామసభలో నిర్భయంగా చెప్పాలని, లేదంటే నేరుగానైనా మా దృష్టికి తెస్తే విచారణ చేసి తొలగిస్తామన్నారు. ఈ సందర్భంగా నాలుగు ప్రభుత్వ పథకాలైన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసాకు సంబంధించిన అర్హుల జాబితాను చదివి వినిపించారు. అయితే ఒకరిద్దరి పేర్లపై స్థానిక మాజీ ఎంపీటీసీ సురేష్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో విచారణ చేసి నిజంగానే అర్హత లేకపోతే తొలగిస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో ప్రత్యేక అధికారి దుర్గం శంకర్, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, ఎంపీడీవో అరుణరాణి, తహసీల్దార్ స్వాతి, వ్యవసాయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఏపీవో దివ్యరెడ్డి, ఏపీఎం సులోచనరెడ్డి, రెవెన్యూ, ఐకేపీ, అగ్రికల్చర్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తానూర్ , జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హిప్నెల్లి, హిప్నెల్లి తండా, కర్బాల, సింగన్‌గావ్, బోంద్రడ్, బామిని తండా, ఎల్వి, కోలూర్ గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అబ్దుల్ సమద్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న నూతన పథకాలయిన ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా. రేషన్‌కార్డులు లబ్ధిదారుల ఎంపికలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సందర్భంగా లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులున్నారు.



దిలావర్‌పూర్ బన్సపల్లిలో జరిగిన గ్రామసభ

అడవి పందుల దాడిలో మొక్కజొన్న నష్టం

సారంగాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల రవీంద్రనగర్ గ్రామ పంచాయతీ అనుబంధ తండా అయిన చర్చి తండాకు చెందిన జాదవ్ రూప్‌సింగ్ అనే రైతు 5 ఎకరాలలో వేసినటువంటి మొక్కజొన్న పంటను బుధవారం అడవి పందులు దాడి చేయడంతో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని తండా వాసులు తెలిపారు. చేతికి వచ్చినటువంటి మొక్కజొన్న పంట పందుల దాడితో నష్టపోవడంతో సుమారు రూ. 5 లక్షలు నష్టం జరిగిందని రైతు పేర్కొన్నారు. దీంతో సంబంధిత అధికారులు స్పందించి రైతును ఆదుకోవాలని తండా వాసులు పేర్కొన్నారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ముథోల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి అమ్మనాన్న కన్న కలలను సాకారం చేసుకోవాలని ముథోల్ ఎస్సై సంజీవ్ సూచించారు. బుధవారం మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమ శిక్షణ, పట్టుదల అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, సైబర్ క్రైమ్స్, తదితర వాటిపై అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలకు పాల్పడినట్లుగా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు పెరుగుతుండటంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలిపారు. మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర చారి, రామ గౌడ్, గంగాధర్, నరేష్, ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితబంధు కారణంగా కుల బహిష్కరణ

● వేధిస్తున్నారని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతి

లక్ష్మణచాంద, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం రెండు దళిత వర్గాల మధ్య చిచ్చు రాజేసింది. మండల కేంద్రంలో దళితబంధుకు ఎంపికైన 10 కుటుంబాలను సొంత సామాజికవర్గం వారు బహిష్కరణ చేసి వేధింపులకు గురి చేస్తున్నారని బాధితులు బుధవారం నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. సమస్య పరిష్కరించి ఆదుకోవాలని విన్నవించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మాజీ జడ్పీటీసీ సుంకరి సుభాష్, మొగ్గం మోహన్, ఎంజలి నడిపి రాజేశ్వర్, భైండ్ల ప్రభుదాస్, సుంకరి ముత్తన్న ఉన్నారు.

బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బడి ఈడు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని బాలల సంరక్షణ సమితి చైర్మన్ ఎండీ వాహిద్ అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా బుధవారం సోన్ మండలంలోని సిద్దుల కుంట గ్రామంలో మేకల కాపరిగా బాలుడిని పనికి పెట్టుకున్న యజమాని ఎన్. నిఖిల్‌పై లేబర్ ఆఫీసర్ చర్య తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం బాలుడికి కౌన్సిలింగ్ నిర్వహించి బాలల సంరక్షణ సమితి ఆదేశాల మేరకు బాలుడిని పాఠశాలలో చేర్పించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జున్ను అనిల్, సైమన్ సుందర్, నల్ల శ్రీలత, దేవి మురళి, ఓస శ్రీనివాస్, లక్ష్మణ్, నరేందర్, కరుణశ్రీ, టౌన్ ఎస్సై సాదిక్ హుస్సేన్, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

నిర్మల్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థలో పని చేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని ప్రతి సర్కిల్ ఆఫీస్‌లలో ఐదు రోజుల రిలే నిరాహార దీక్షలను చేపడతామని ఇందులో భాగంగా పట్టణంలో మూడవ రోజు రిలే నిరాహార దీక్షలను శాంతియుతంగా నిర్వహించినట్లు టీవీఏసీ జేఏసీ కమిటీ చైర్మన్ డి.మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్.రాజు, డి.స్వామి, మహేందర్, కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత

సారంగాపూర్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలో గల ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించిన చందర్ గౌడ్ బుధవారం పదవీ విరమణ పొందిన నేపథ్యంలో విద్యార్థుల కోసం వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేసినట్లు ఎంఈవో మధుసూదన్ తెలిపారు. విద్యార్థుల త్రాగునీటి కోసం ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఖానాపూర్ అడవుల్లో చెట్లు నరికిన ముఠా అరెస్టు

● అధికారులపై దాడికి యత్నించిన మరో ముగ్గురు పరార్
● మొత్తం 12 మంది నిందితులుగా అధికారుల అనుమానం
● మరింత లోతుగా విచారిస్తున్నామని ఎఫ్ఆర్‌వో కిరణ్ కుమార్ వెల్లడి

ఖానాపూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలంలోని అడవుల్లో గత నెల 19వ తేదీన వనమేధానికి పాల్పడిన ముఠాలో ముగ్గురిని అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ వనమేధంలో సుమారు 12 మంది స్మగ్లర్లు పాల్గొనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్మగ్లర్లలో దోస్త్‌నగర్‌కు చెందిన గండి గొప్పల నగేష్, కడెం మండలం మైసంపేట్ పునరావాస గ్రామానికి చెందిన దోసండ్ల శ్రీనివాస్, మంచిర్యాలకు చెందిన మధిర రాజగోపాల్‌లను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో జగిత్యాలలో దుండగులు తలదాచుకున్నట్లు సమాచారం రావడంతో వెతికేందుకు వెళ్లిన సెక్షన్ అధికారులు రవీందర్, కుతుబుద్దీన్‌లపై సతీష్, సంజీవ్, శేఖర్ అనే ముగ్గురు స్మగ్లర్లు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం దోనూరు వద్ద మంగళవారం సాయంత్రం కారుతో ఢీకొట్టి పరారయ్యారని తెలిపారు. వీరంతా మంచిర్యాల జిల్లా జన్నారం మండలం టీజీ పల్లె, కడెం మండలం కల్లెడకు చెందిన వారుగా గుర్తించినట్లు తెలిపారు. చెట్లను నరికేందుకు ఉపయోగించిన పరికరాలను అందజేసిన వ్యక్తి ఎంబడి శేఖర్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. రోడ్డు పక్కన చెట్లు నరకడంతో పాటు టీఎస్ 15 యూఏ 3722 అనే నెంబర్ గల కారుకు ఏపీ 37 బీజే 6747 అనే తప్పుడు నెంబర్‌ను తగిలించుకొని ఆ కారులో కలప దుంగలను తరలించినట్లు పేర్కొన్నారు. ఈ టేకు దుంగలను తరలించేందుకు మరో జస్ట్, బ్రీజా వాహనాలను సైతం వాడినట్లు కిరణ్ కుమార్ తెలిపారు. ఈ నేరానికి పాల్పడిన దుండగులపై గతంలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. వీరిని రిమాండ్‌కు పంపడంతో పాటు ఈ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్ఆర్‌వో కిరణ్‌కుమార్

కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టి మిగతా వారందరినీ అరెస్ట్ చేయడంతో పాటు వాహనాలను సైతం స్వాధీనం చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా అటవీ అధికారులకు సవాల్‌గా మారిన ఈ కేసును త్వరగా ఛేదించిన సెక్షన్ అధికారులు రవీందర్, కుతుబుద్దీన్ సహా బీట్ అధికారులు కే. రాము, నరేందర్, ముత్యంలను ఎఫ్ఆర్‌వో అభినందించారు.

అలవెన్స్ పెంచాలని ధర్నా

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైల్వేలో పని చేస్తున్న లోకో పైలట్లకు పెరిగిన డీఏకు అనుగుణంగా రన్నింగ్ అలవెన్స్ పెంచాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ అన్నారు. బుధవారం రైల్వేస్టేషన్‌లోని లాబి ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే లోకో పైలట్ గార్డ్‌లకు కిలోమీటర్ అలవెన్స్ 25 శాతం పెంచాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి సంతోష్ అన్నారు. రైల్వే సిబ్బంది అందరికీ డీఏ 50 శాంత పెంచి టీఏ సైతం పెంచారన్నారు. కానీ లోకో పైలట్లకు గార్డ్‌సకు అన్యాయం చేశారన్నారు. పెంచిన డీఏకు అనుగుణంగా కిలోమీటర్ అలవెన్స్ 25 శాంత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశిష్ రంజన్, సిరాజ్ ఆలం, రింకు కుమార్, డీఎస్ రాజు, హేమంత్ కుమార్, ఆశిష్ దోకే పాల్గొన్నారు.

అవసరమైన చోట సేవలు అందించాలి



ఫ్రీజ్‌ను అందజేస్తున్న ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ నాయకులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సేవ కార్యక్రమాల్లో ముందుకు వచ్చి అవసరమైన చోట సేవలు అందించాలని ఆర్యవైశ్య యూత్ అసోసియేషన్ నాయకులు అన్నారు. బుధవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.70 వేల విలువ గల ఏసీ డెడ్ బాడీ ఫ్రీజర్‌ను తిర్పెల్లి స్మశాన వాటికకు అందించారు. ప్రతి ఒక్కరు సామాజిక సేవలో రాణించాలని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో 24 ఏండ్లుగా సేవ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. తమవంతుగా స్మశాన వాటిక ఫ్రీజర్‌ను ఇచ్చామన్నారు. పట్టణ ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఆనంద్ ఉత్తర్వార్, ప్రధాన కార్యదర్శి వికాస్ ఉత్తర్వార్, కోశాధికారి కిరణ్ కుమార్ చింతవార్, అసోసియేట్ ప్రెసిడెంట్ క్రాంతి కుమార్, ఉపాధ్యక్షులు కపిల్, గణేష్, సాయికృష్ణ, సాయి సంతోష్, రాయిపెల్లి దత్త పాల్గొన్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ నూతన కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఆదిలాబాద్ జిల్లా శాఖ ఎన్నికలను బుధవారం కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పి.గోవింద్, కార్యదర్శిగా ఆర్.అలోప్ సింగ్, ట్రెజరర్‌గా బి.నరేందర్‌తోపాటు పలువురిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. టీఎన్జీఓ జిల్లా అధ్యక్షులు అశోక్, ప్రధాన కార్యదర్శి ఎ.నవీన్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశం విజయవంతం చేయాలి

నార్నూర్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్‌లో గురువారం ఎమ్మార్పీఎస్ సన్నాహక సమావేశం ఉన్నందున అత్యధిక సంఖ్యలో జనాలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు జిల్లాపెల్లి సుకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణ సాధించే దిశగా తుది ఘట్టంగా జనవరి 27న హైదరాబాద్‌లో లక్ష డప్పుల, వెయ్యి మంది కళాకారుల గొంతులతో దండోరా ప్రదర్శన, సభ ఉన్నందున జిల్లాకు రేపు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి పలు కీలకమైన అంశాలపైన సలహా సూచనలు జిల్లా వాసులకు చేయనున్నారు. మండలంలోని అత్యధిక సంఖ్యలో ప్రజలు, నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు శివాజీ, రతన్, ప్రకాష్ ఉన్నారు.

అర్హులకు లబ్ధి చేకూరలేదని నిలదీత



సుంకిడిలో ఏర్పాటు చేసిన గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరికొండ, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందడం లేదని గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అధికారులను నిలదీశారు. బుధవారం సుంకిడి, పోచంపల్లి, కన్నాపూర్, లచ్చింపూర్(బి), మల్లాపూర్, రిమ్మ, తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అర్హులైన లబ్దిదారులకు జాబితాలను రూపొందించకుండా అనర్హుల జాబితాలను ప్రదర్శించడంతో గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో అర్హులైన తమకు కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పేర్లు రాలేదని గామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతోనే అర్హులైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో భూమి లేని వ్యవసాయ కూలీలు ఉపాధి పనులు చేసుకుంటున్నప్పటికీ వారికి ఆత్మీయ భరోసా జాబితాలో చోటు దక్కలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రత్యేకాధికారి రామకిషన్ మాట్లాడుతూ...నాలుగు పథకాలకు సంబంధించిన జాబితాల్లో అర్హులైన వారి పేర్లు రానివారు మళ్ళీ దరఖాస్తు చేసుకునే వీలు కల్పించిందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

24న ఉమ్మడి జిల్లాకు రానున్న రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ ఈనెల 24వ తేదీన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో తమ మొదటి పర్యటన కొనసాగించనుందని మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పడిన రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ 9 మంది సభ్యులతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పర్యటించి రైతు కుటుంబాలతోపాటు రైతులను రైతు సంఘం నాయకులను కలిసి వారితో సమీక్షించి రైతు సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో క్రైమ్ రేట్ పెంచి రైతులపై రైతు మద్దతుదారులపై అక్రమ కేసులు పెట్టాలని ఆలోచన తప్ప రైతు సంక్షేమపై దృష్టి సారించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచేందుకే రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ రైతులకు మద్దతుగా వారికి అండగా ఉండేందుకు నెల రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో పర్యటనలు చేయనుందని తెలిపారు.

ప్రత్యేక ఆధార్‌సెంటర్ ఏర్పాటు చేయాలి



ఉట్నూర్ సబ్‌కలెక్టర్‌కు మెమోరాండం ఇస్తున్న దృశ్యం

ఉట్నూర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): వన్ నేషన్ వన్ స్టూడెంట్ ఐడీలో భాగంగా పాఠశాలలో చదివే విద్యార్థుల యొక్క ఆధార్‌కార్డులో జననతేదీ, పేర్లలో చిరునామాలలో మార్పులు చేయడానికి విద్యార్థుల కోసం ప్రత్యేక ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్‌ను పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అజయ్ కోరారు. బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించానన్నారు. ప్రస్థుత తరుణంలో ఆధార్‌కార్డు లాగానే ప్రతి ఒక్క విద్యార్థికి అపార్ కార్డు అనేది తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఏపీఏఆర్ ఐడీ కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థి పేరు, పాఠశాల రికార్డులో, ఆధార్‌కార్డులో ఒకే విధంగా ఉండాలని నియమ నిబంధనలు పెట్టిందని కాని ప్రస్తుతం ఆధార్‌కార్డులో ఉన్న జననతేదీ కావచ్చు వారి యొక్క పేర్లు మార్పు చేయడానికి ఎన్నో నిబంధనలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్ సెంటర్‌కి వెళ్లి మార్పు చేసుకోలేక పోతున్నారని తెలిపానన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వాలంటే ప్రతి మండల కేంద్రంలో విద్యార్థుల కోసం ఒక ప్రత్యేకమైన ఆధార్‌సెంటర్ ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్‌ని కలవగా ఈ విష యాన్ని కలెక్టర్‌కి నివేదించి తొందరలోనే దీనికి ఒక శాశ్వత పరిష్కారం కనుక్కుంటానని హామీ ఇచ్చారన్నారు.

దుప్పిని వేటాడిన వ్యక్తి అరెస్టు



వన్యప్రాణి వేటగాన్ని అరెస్టు చేసిన బీర్సాయిపేట అటవీశాఖ అధికారులు

ఉట్నూర్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని ఉమాపతి కుంట గ్రామానికి చెందిన గిరిజనుడు తొడసం చిన్న ఇటీవల చుక్కల దుప్పిని వేటాడిన నేరం పై అరెస్టు చేసి కేసు నమోదు చేశామని బీర్సాయి పేట అటవి క్షేత్ర అధికారి అరుణ తెలిపారు. తమ కుక్కలతో చుక్కల దుప్పి ని వేటాడి పంట చేనులో దుప్పి మాసం ఆరబెడుతు ఉండగా పట్టుకున్నా మని తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆదిలాబాద్ జిల్లాకు మందకృష్ణ మాదిగ రాక

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించే సన్నాహక సమావేశానికి 23న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10గంటలకు ర్యాలీ ప్రారంభమై నేతాజిచౌక్, వినాయక్‌చౌక్, ఎన్టీఆర్‌చౌక్, కలెక్టర్, బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా మీదుగా ఉంటుందన్నారు. ఈ ర్యాలీలో మాదిగ జాతి ముద్దుబిడ్డ మందకృష్ణ పాల్గొననున్నట్లు తెలిపారు.



రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తున్న ప్రదీప్‌కుమార్‌గౌడ్

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ

వాహనాలు నడపాలి

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ గౌడ్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జైనథ్ మండలంలోని హైస్కూల్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు రోడ్డు భద్రత పై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్‌గౌడ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం రోడ్డు ప్రమాదాల భారిన పడి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీంతో వారి కుటుంబాలు చిన్నా భిన్నం అవుతున్నాయని, ట్రాఫిక్ నిబం ధనలు పాటించి జాగ్రత్తగా వాహనాలు నడిపితే ప్రమాదాలను అరికట్ట వచ్చన్నారు. వేగాన్ని నియంత్రించుకుంటు ప్రయా ణాలు చేసినప్పుడే రో డ్డు ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ అత్యంత రక్షణ కవచంగా ఉంటుందన్నారు. 85శాతం మంది ద్విచక్ర వాహనాల పై ప్రయా ణిస్తున్న వారు హెల్మెట్ లేని కారణంగానే తలకు తీవ్ర గాయాలై మృత్యువాత పడుతున్నారని ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిందన్నారు. ఇందులో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.లక్ష్మన్న, మండల వైద్యఅధికారి, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యవంతులను చేస్తాం



మాట్లాడుతున్న ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహరాజ్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): భారత దేశ పౌరులకు రాజ్యాంగ విలువలు తెలియకుండా ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని దీన్ని తిప్పి కొట్టేలా తమ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలతోపాటు ప్రజలను చైతన్యవంతులను చేస్తామని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహరాజ్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు లక్ష పోస్టు కార్డుల ఉద్యమంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డికి బుధవారం పో స్టాఫీస్ నుంచి పోస్టు కార్డులను పంపించారు. గణతంత్ర దినోత్సవం రోజు రాజ్యాంగంతో పాటు అంబేద్కర్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని నినా దాలు చేశారు. ప్రభుత్వాలు ప్రజలకు రాజ్యాంగ విలువలు తెలియజేసేలా ప్రాథమిక దశ అయిన పాఠశాల ద్వారా కార్యక్రమాలు చేపట్టాలని అగ్గి మల్ల గణేష్ మహారాజ్ అన్నారు. ఉదయం ప్రార్థన సమయంలో రాజ్యాం గ పీటికను చదివించాలన్నారు. గణతంత్ర దినోత్సవం రోజు రాజ్యాంగంతో పాటు అంబేద్కర్ చిత్రపటాలను ఉంచి వేడుకలను నిర్వహించాలన్నారు. దీనిపై ప్రభుత్వాలు జీఓను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ని ర్లక్ష్యం చేస్తే పార్టీ తరఫున రథయాత్రలు నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న సంస్థ అధ్యక్షులు కొమ్ము రాము

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మారుమూల గిరిజన గ్రామం, తిప్ప గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, గ్రామంలో ఆదిలాబాద్‌కు చెందిన న్యూ రెయిన్ బో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, పొదుపు స్వయం ఉపాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కొమ్ము రాము మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన గిరిజన మహిళలు, ఆర్థిక అక్షరాస్యత, స్వయం ఉపాధిపై అవగాహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరు బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని, బీమా సౌకర్యం పొందే సౌలభ్యం పొందుతారని, గ్రామంలోని స్వయం సహాయక గ్రూపు మహిళలకు మక్కువ ఉంటే తమ పరిసరాల్లో సహజ సిద్ధంగా దొరికే, అడవిలో ఉన్నటువంటి వనరుతో వెదురు బొంగులతో బుట్టల తయారి, విస్తరాకుల తయారీ, ఇప్ప పువ్వుతో ఇప్ప లడ్డూల తయారిపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వయం సహాయక గ్రూపు మహిళలు(ఎస్‌హెచ్‌జీ), గ్రామ పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను

ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని బాలాపూర్ ప్రజా పాలన గ్రామసభకు హాజరై మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్, మాజీ సర్పంచ్ వినోద్ యాదవ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బాలాపూర్ ప్రజాపాలనలో పాల్గొన్న అధికారులు

చిన్న వయసు.. పెద్ద మనసు

» సామాజిక సేవలో ఇచ్చోడ యువకుడు సుజయ్ » రెండేళ్లుగా గిరిజన పిల్లలకు పౌష్టికాహారం » గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి బాటలు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆ యువకుడి వయస్సు చిన్నదే.. కానీ మానవత్వం పెద్ద మనస్సు కలవాడు.. హైదరాబాద్‌లో విద్యను అభ్యసిస్తూనే స్వగ్రామంలో పేదలకు మేలు చేయాలన్న తపన ఉన్నవాడు.. రక్త హీనతతో బాధపడే గిరి జనుల పిల్లలకు పౌష్టికాహారం అందించడం, గిరిజన గ్రామాల్లోని మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవ గాహన కల్పించడం లాంటి సేవా కార్యక్రమాలనే లక్ష్యంగా పెట్టుకున్నాడు.. దీని కోసం 'సంరోహ' పేరిట ఓ స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి వివిధ రకాల సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిస్తున్న ఆ యువకుడిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలకేంద్రానికి చెందిన సురుకుంటి విజయ శాంతి - శ్రీనివాస్ రెడ్డి దంపతుల కుమారుడు.. సుజయ్ రెడ్డి.. తల్లిదండ్రులు నేర్పిన సంస్కారం, మానవతా భావాలతో చిన్నప్పటి నుంచే సేవా దృక్పథాన్ని అలవర్చుకున్నాడు. హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతూనే.. సెలవులకు వచ్చినప్పుడు.. పేదల పరిస్థితులను గమనించేవాడు.. ఇందులో భాగంగా 'సంరోహ' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నారు.

రెండేళ్లుగా సేవా కార్యక్రమాలు..

సుజయ్ రెడ్డి తన సంస్థ ద్వారా గత రెండున్నర సంవత్సరాలుగా.. పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సుజయ్ తన స్వచ్ఛంద సంస్థ ద్వారా మొదటి ప్రాజెక్టుగా(న్యూట్రిషన్ ప్రాజెక్ట్) పేరిట.. గిరిజన పిల్లల కోసం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకాపూర్ జీపీ పరిధిలోని కొలాంగూడలో రెండేళ్లుగా 35 మంది పిల్లలకు రోజూ పోషకాహారాన్ని అందేలా చూస్తూ రక్తహీనతకు గురికాకుండా అక్కడ ఒక వాలంటీర్‌ను నియమించి.. వారికి వేతనం అందిస్తూ.. గ్రామంలోని గిరిజన పిల్లల మెరుగైన ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నారు.. దీంతో ఆ గ్రామంలో ఇంతకు ముందు కంటే ఇప్పుడు పిల్లలు ఆరోగ్యంగా ఉన్నట్లు వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు

గిరిజనుల ఆర్థిక అభివృద్ధికి బాటలు..

సుజయ్ సేవా కార్యక్రమాలు చేస్తూనే.. రెండో ప్రాజెక్టుగా' ఆర్థిక అక్షరాస్యత' పేరిట.. గిరిజన గ్రామా ల్లో బ్యాంకు లావాదేవీల విషయంలో గిరిజన మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ.. వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నాడు.. చిన్న వయసులో పేదల గురించి ఆలోచించి చేతనైన సాయం చేస్తున్న సుజయ్ రెడ్డి మంచితనం గురించి స్థానికంగా చర్చించుకుంటున్నారు. కాగా చిన్న వయసులోనే సేవా దృక్పథంతో ముందుకు వెళ్తున్నారు. తల్లిదండ్రులు కూడా ప్రోత్సహిస్తున్నారు.. ఓ వైపు చదువు మరోవైపు సేవా కార్యక్రమాలు చేస్తున్న.. ఆ యువకుడు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆశిద్దాం.



గిరిజన విద్యార్థులతో సుజయ్‌రెడ్డి (ఫైల్)



గిరిజన మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్న సుజయ్



గిరిజన పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తూ..

ఆదర్శం



కొలాంగూడలో రాగిజావ తాగుతున్న గిరిజన విద్యార్థులు..

డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీ



మొక్కజొన్న పంట చేలలో డ్రోన్ ఆపరేటింగ్ చేస్తున్న ఆపరేటర్



పురుగుమందు పిచికారికి సిద్ధమైన డ్రోన్

బోథ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు కూలీల కొరత వల్ల డ్రోన్ ద్వారా పురుగుల మందు పిచికారీ పైన ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్న పంటపై పురుగు మందు పిచికారీ చేయాలంటే అడవి పం దుల బెడద ఉండడంతో పిచికారికి రైతులు ఆసక్తి చూపడం లేదు. మరో వైపు కూలీలు దొరకకపోవడం వల్ల డ్రోన్ సహాయంతో మందుల పిచికారిపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఒక గంటకు 400 రూపాయలు అద్దె చెల్లించి మం దు పిచికారి చేయిస్తున్నారు. అంతేగాక డ్రోన్ సహాయంతో పిచికారి చేస్తే పురుగుల మందు ఆదా కావడంతోపాటు సమయం ఆదావుతుందని రైతులు అంటున్నారు. డ్రోన్ పిచికారికి మందుతో పాటు నీరు సహితం తక్కువగా అవసరమవుతుందని రైతులు కోరుకుంటున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రైతులకు గ్రామానికి నలుగురు, ఐదుగురికి డ్రోన్‌లను ప్రభుత్వ పరంగా అందించినట్లయితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అంటున్నారు.



కాల్మొక్కుతా సారూ..

కనికరించండి!

● పింఛన్ కోసం ఆదిలాబాద్ కలెక్టర్ కాళ్లు పట్టుకున్న వృద్ధురాలు

ఆదిలాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పింఛన్ ఇప్పించాలంటూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కాళ్లు పట్టుకుందో మహిళ. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో వార్డు సభ నిర్వహించారు. ఈ సభకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా వచ్చారు. దీంతో అక్కడే ఉన్న నిర్మలమ్మ అనే వృద్ధురాలు ఆవేదనతో 'కాల్మొక్కుతా సారూ.. నన్ను కనికరించండి' అంటూ కలెక్టర్ కాళ్ల మీద పడి తనకు పెన్షన్ ఇప్పించాలని వేడుకుంది. తనకు చాలా ఏళ్ల తరబడి ఎలాంటి పెన్షన్ రావడం లేదని కలెక్టర్‌కు మొర పెట్టుకుంది. ఇంట్లో ఒక దాన్నే ఉంటున్నానని, కనీసం ఇళ్లు కూడా లేదని నిర్మలమ్మ వాపోయింది. దీంతో స్పందించిన కలెక్టర్ సదరు మహిళకు భరోసానిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందేవిధంగా చూడాలని అక్కడ ఉన్న అధికారులను ఆదేశించడంతో నిర్మలమ్మ ఆనందం వ్యక్తం చేసింది.

ఆదిలాబాద్‌ను వణికిస్తున్న చలి

● బేలలో 8.5 కనిష్ట ఉష్ణోగ్రత



చలి తీవ్రతకు వెచ్చని దుస్తులు ధరించి వెళ్తున్న వాకర్స్



చలిమంటలు వేసుకుంటూ వెచ్చదనం పొందుతున్న దృశ్యం

ఆదిలాబాద్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలే నమోదవుతున్నాయి. బుధవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 32.0, కనిష్టంగా 9.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే అత్యల్పంగా బేల మండలంలో 8.5, బోథ్‌లో 9.2, జైనథ్‌లో 9.7, తాంసిలో 10.6, తలమడుగులో 11.0 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 15 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో చలితీవ్రత విపరీతంగా కనిపిస్తుంది. ఉదయం సాయంత్రం వేళల్లో చలిప్రభావం ఎక్కువగా పెరగడంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో శ్వాసకోస వ్యాధుల భారిన పడి జనం ఆసుపత్రుల పాలవుతున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. జనవరి మాసం ముగిసి పోతున్న చలితీవ్రత మాత్రం తగ్గడం లేదంటున్నారు. ఫిబ్రవరి రెండవ వారం వరకు జిల్లాలో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణశాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో

మొక్కులు తీర్చుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి



లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించిన డీఎస్పీ జీవన్ రెడ్డి

జైనథ్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయాన్ని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీని స్వామి వారి మెమోంటో, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తం, ఆలయ కమిటీ ఛైర్మన్ అడ్డి రుకేష్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గడ్డం జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

ఫోటో న్యూస్



వాగులో పూర్తిగా గుర్రపు డెక్కతో నిండి ఉన్న దృశ్యం

వాగును మింగేస్తున్న గుర్రపు డెక్క

ఆదిలాబాద్ పట్టణ శివారులోని చాందావాగులో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచి పోయింది. వాగు పూర్తిగా గుర్రపు డెక్క నిండి పోవడంతో పచ్చని పొలంలా దర్శనమిస్తుంది. ఇప్పటికే పట్టణం లోని ఖానాపూర్ వాగు సైతం గుర్రపు డెక్కతో నిండిపోగా పలు మార్లు దానిని తొలగించినా ఫలితం లేకుండా పోయింది. తాజాగా చాందా వాగును సైతం ఇదే సమస్య పట్టి పీడిస్తుండడం స్థానికుల్లో ఆందోళనకు దారి తీస్తుంది.

(ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫోటోగ్రాఫర్)

జిల్లా ఖజానా శాఖ

అధికారిని కలిసిన టీఎన్జీవో సభ్యులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా ఖజానా శాఖ అధికారిగా ఎన్.రామచంద్ర రాజు బాధ్యతలు చేపట్టారు. బుధవారం అయనను కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయం లో టీఎన్జీవో సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం పెండింగ్ బిల్లులు తదితర అంశాలపై చర్చించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్, ఎ.నవీన్ కుమార్, సభ్యులు తిరుమల రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



జిల్లా ఖజానా అధికారిని సన్మానిస్తున్న టీఎన్జీవో సభ్యులు



ఒక్కక్షణం.. ఆలోచించండి!

- జిల్లాలో ఏటా పెరిగిపోతున్న ఆత్మహత్యలు
- క్షణికావేశంలో గాలిలో కలుస్తున్న నిండు ప్రాణాలు
- మద్యం మత్తులో ఉసురు తీసుకుంటున్న వారే అధికం
- కుటుంబ, ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులే అసలు కారణం
- సర్వత్రా ఆందోళనలు రేపుతున్న ఆత్మహత్యల ఘటనలు
- గత ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా 252 మంది బలవన్మరణాలు


గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన రైతు నారాయణ ఫొటోతో కుటుంబ సభ్యులు(ఫైల్)

ఆదిలాబాద్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సమస్య ఏదైనా నిండు ప్రాణాలను తీసుకుంటున్నారు. క్షణికావేశంలో పురుగుల మందు, ఉరి తాళ్లను ఆశ్రయిస్తూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. అయితే ఒక్క క్షణం ఆలోచిస్తే ప్రాణాలు నిలబడే అవకాశం ఉంటుందని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఏటా పెరిగిపోతున్న ఆత్మహత్యల ఘటనలతో మరింత ఆందోళన రేపుతోంది. గడిచిన యేడాదిలో జిల్లా వ్యాప్తంగా 252 మంది వివిధ కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. కానీ మరెన్నో ఘటనలు వెలుగులోకి రావడం లేదు. జీవితం పట్ల విరక్తి, తీవ్ర మనోవేదన, కుటుంబ, ఆర్థిక సమస్యలు, చిన్న పాటి సమస్యలకే భయాందోళనకు గురికావడం, పరువు ప్రతిష్ఠలకు పోవడం, ఆత్మహత్యలకు ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. జిల్లాలో నిత్యం ఎక్కడో ఓ చోట ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటేనే ఉన్నాయి. ఆత్మహత్యకు పాల్పడుతు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతు మృతి చెందిన వారి సంఖ్య వారానికి ఒకటి రెండు సంఘటనలు ఉంటున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే పోలీసులు ఆత్మహత్య ఘటనలపై కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్నారే తప్ప.. ఆత్మహత్యలకు అసలు కారణం ఏమిటన్న విషయాన్ని గ్రహించి ఇలాంటి సంఘటనలు పునరావృతంకాకుండా చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జిల్లాలో జరిగిన రైతు ఆత్మహత్యలు రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే కదిలి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. మద్యం మత్తు, అప్పుల బాధతో ఆత్మహత్యలు చేసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నా నిండు ప్రాణాలు మాత్రం గాలిలో కలుస్తున్నాయి. పోలీసులు కళాజాతా బృందాలతో అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నా ఆపదలో ఉన్న వారిని గుర్తించి భరోసా కల్పించి ఉంటే విలువైన ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


భీంపూర్ మండలం పిప్పల్‌కోటికు చెందిన రైతు ఎడెపెల్లి రమేష్ ఫొటోతో కుటుంబ సభ్యులు(ఫైల్)

గాలిలో కలుస్తున్న ప్రాణాలు

ఆశించిన దిగుబడులు రాక, చేసిన అప్పులు తీర్చే మార్గం లేక గతిలేని పరిస్థితుల్లో రైతులు ఉసురు తీసుకుంటున్నారు. అయితే ప్రతియేడు పంట చేతికి వచ్చిన సమయంలోనే రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. గడిచిన యేడాదిలో 32మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఈ యేడు గడిచిన 22 రోజుల్లోనే ముగ్గురు రైతులు ఉసురు తీసుకున్నారు. జిల్లాలో సహజ మరణాల కంటే ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్యనే ఎక్కువగా కనిపిస్తోంది. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 50ఏళ్ల లోపు వారే అధికంగా ఉంటున్నారు. ముఖ్యంగా యువత వ్యసనాలకు బానిసై ప్రాణాలు తీసుకుంటున్నారు. కారణం ఏదైనా పోలీసుల రికార్డుల్లో మాత్రం కుటుంబ కలహాలు, కడుపునొప్పితో ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు కేసులు నమోదవుతున్నాయి.

మత్తుతో ప్రాణాలు చిత్తు

మద్యం మత్తు, గంజాయి వ్యసనానికి బానిసలవుతున్న యువత అనారోగ్య బారిన పడి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మద్యం మత్తులో పురుగుల మందును తాగుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మద్యపానం ఆరోగ్యానికి హానికరం అంటూ హెచ్చరికలు చేస్తూ చేతులు దులుపుకుంటున్న ప్రభుత్వం ఆ మహమ్మారి బారిన పడుతున్న వారిని గుర్తించి కాపాడలేక పోతుందన్న విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా మద్యపాన నిషేధ శాఖ (ఎక్సైజ్) దాని ఊసే ఎత్తకపోవడంతో తాగుడికి బానిసలవుతు అదే మత్తులో ప్రాణాలు తీసుకుంటున్నారు. దీంతో పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

చావే పరిష్కారం కాదు

జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమించాలే తప్ప.. చావడమే పరిష్కారం కాదు. చిన్న పాటి సమస్యలకే భయపడుతు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై ఇక జీవితమే లేదనుకోవడం సరైంది కాదంటున్నారు. స్తోమతకు మించి ఆశపడడం, కోరికలను తీర్చుకునేందుకు అప్పులు చేయడం చివరకు అవి తీరక పోవడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడితో ప్రాణాలు తీసుకోవడం పరిపాటిగానే మారుతోంది. కుటుంబ తగాదాలకు పరిష్కార మార్గాలు ఎన్నో ఉన్నా.. క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ప్రేమవిఫలం కావడంతో ఇక జీవితమే లేదనట్లుగా భావిస్తున్న యువత బలవంతంగా ఉసురు తీసుకుంటున్నారు. ఓటమి గెలుపులు సహజమే అయినప్పటికి విఫలం కావడంతో ఇక చావే దిక్కనుకుంటున్నారు. ఎక్కువగా కుటుంబ సమస్యలు, ప్రేమ విఫలంతో మహిళలు, యువకుల ఆత్మహత్యలే జరుగుతున్నాయి. అనారోగ్య బారిన పడిన వారంతా భయంతో ముందుగానే ప్రాణాలు బలితీసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఒక్కక్షణం ఆలోచిస్తే పరిష్కార మార్గం దొరికే అవకాశం ఉంటుంది. తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురైనప్పుడు తోటి వారితో తమ బాధలను పంచుకుంటే సగం సమస్యలు తీరిపోయే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ మున్సిపల్ అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులు తెప్పించి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దతానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఎమ్మెల్యే టీయూఎఫ్ఐడీసీ నిధులతో మున్సిపాలిటీలోని దుర్గ నగర్ కాలనీలో సైడ్ డ్రైన్‌కి భూమి పూజ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోనే ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం అని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. అనంతరం కాలనీ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో రఘుపతి, రాజన్న, సుధాకర్ పాల్గొన్నారు.

కేస్లాపూర్ అభివృద్ధికి రూ.13 కోట్లు కేటాయించాలి

- శాంతి కుమారిని కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్


సీఎస్ శాంతికుమారిని కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్,జనవరి 22(ఆంధ్రజ్యోతి)దక్కన్ పీఠభూమిలో కొలువైన ఆదివాసులకు ఆరాధ్య దైవం నాగోబా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామాన్ని అభివృద్ధి పర్చేందుకు రూ.13 కోట్లు మంజూరు చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని కోరారు. మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే ఆత్రంసక్కుతో కలిసి హైదరాబాద్‌లో సీఎస్‌తో సమావేశమై పలు అంశాలను చర్చించిసమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అటవీ శాఖ అభివృద్ధికి సహకరించడం లేదని అయన సీఎస్‌కు వివరించారు. టైగర్ జోన్ పరిధిలో వాహనాల రాకపోకలను అటవీశాఖ అడ్డుకోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అటవీ అనుమతులు రాకపోవడంతో మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణం నిలిచిపోయిందని ఎమ్మెల్యే సీఎస్ దృష్టికి తీసుకొచ్చారు. విద్య, వైద్యం సమస్యలు పరిష్కరించడంతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏకు నిధులు విడుదల చేయాలని కోరారు.ఇటీవల ఆదివాసీ ప్రతినిధులతో సీఎం సమావేశమైనప్పుడు చర్చకు వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరినట్లు వివరించారు. ఈ విషయాలపై ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు

- అబ్కారీ శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్

నార్నూర్, జనవరి 22(ఆంధ్రజ్యోతి):ప్రజల ప్రాణాలకు నష్టం జరిగేలా నాటుసారా తయారు చేసి అమ్మడం పెద్ద నేరమని అబ్కారి శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ అక్బర్ అన్నారు. బుధవారం నార్నూర్ మండలం నాగలకొండ గ్రామంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో ఆరు లీటర్ల నాటుసారా, 225 కేజీల నిషేధిత నల్ల బెల్లం, 85 కిలో పట్టిక, మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకుని ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.వారి వెంట అధికారులు రూప్‌సింగ్, ముత్యం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

'ఐకే రెడ్డిపై కేసు నమోదు చేయాలి'



మాట్లాడుతున్న లక్ష్మీపూర్ వాసులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్టరీ నిర్మిస్తామని దళితుల భూములను కొని రియల్ ఎస్టేట్ దందా చేస్తున్న మాజీ మంత్రి ఐకే రెడ్డి, ఆయన కుటుంబీకులపై కేసులు నమోదు చేయాలని జైనథ్ మండలం లక్ష్మీపూర్ వాసులు పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2014-16 వరకు 600ఎకరాల భూమిని కొనుగోలు చేశాడని పేర్కొన్నారు. ఇప్పుడు అదే భూమిని ఎకరం రూ.20 లక్షలకు అమ్ముకుంటున్నారని ఆరోపిం చారు. సమావేశంలో శివ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుంది

ఆదిలాబాద్‌అర్బన్/ఆదిలాబాద్‌రూరల్,జనవరి 22(ఆంధ్రజ్యోతి):ఆడపిల్లలు చదువుకుంటే భవిష్యత్తు బాగుం టుందని జిల్లా సంక్షేమ కమ్యూనిటీ సబిత అన్నా రు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని ప్రారంభించి పదేండ్ల పూర్తి అయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ చౌక్ మీదుగా ర్యాలీ జిల్లా పరిషత్ సమావేశ మందిరానికి చేరుకుంది. ఇక్కడ జ్యోతి ప్రజ్వలన చేసి ఆడ పిల్లల చదువు ప్రాముఖ్యత గురించి తెలిపారు.అనంతరం ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ కమ్యూనిటీ సబిత మా ట్లాడుతూ లింగవివక్షత కారణంగా కడుపులోనే ఆడ పిల్లలను చంపుతున్న సంస్కృతి పెరిగింద న్నారు. దీన్ని గమనించిన ప్రభుత్వం ఆడ పిల్లల రక్షణ కోసం బేటి బచావో బేటటి పడావో అనే నినాదంతో పదేండ్ల క్రితం ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.ఆడపిల్లల రక్షణ కోసం 1098, మహిళాల కోసం 181లాంటి టోల్ ఫ్రీ నెంబర్లను కూడా అందుబాటులోకి తీసుకువచ్చా రన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.ఆడపిలలు ఆ కుటుంబ భవిష్యత్తు మారుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి,డీవైఎస్‌ఓ వెంక టేశ్వర్లు,డీసీపీఓరాజేంద్రప్రసాద్, యశోద పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ కమ్యూనిటీ సబిత

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి22(ఆంధ్రజ్యోతి):అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు వార్డు, గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. రెండో రోజు బేల మండలం డోప్తాల్, భవానిగూడ, పట్టణంలోని వార్డు నెంబర్ 40 సరస్వతీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభలలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలించి పలు సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా వార్డులలో మొదటి రోజు 13, రెండో రోజు 17 మొత్తం 49వార్డులకు గాను 30 వార్డులలో ప్రజాపాలన సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల26 నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలు చేయనుందని తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 21 నుంచి జిల్లా గ్రామ, వార్డు సభలు నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారులు ఈ సభలను ఉపయోగించుకుని పథకాల లబ్ధి పొందాలని సూచించారు. ఈపథకాలపై ఎలాంటి అపోహాలకు లోనుకావొద్దని, పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతుభరోసా పథకం కింద ఎకరానికి రూ.12వేలు చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారితో పాటు లబ్దిదారుల జాబితాలో పేర్లు లేని వారు తమ అర్జీలు సమర్పించవచ్చని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ శాంతిగా జీవించాలి : ఏఎస్పీ

ఉట్నూర్,జనవరి22(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ అన్నారు.బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని సబ్‌డివిజన్ పోలీసుకార్యాలయంలో నూతనంగా వచ్చిన అసిస్టెంట్ పోలీసు సూపరింటెండెంట్ కాజల్‌సింగ్‌ను హిందుసంఘాల ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ ప్రజలు అందరు శాంతిగా ఉండాలని, ఎలాంటి కల్మషాలు లేకుండా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందు ఉత్సవ సమితి అధ్యక్షుడు కొండేరి రమేష్‌తో పాటు డాక్టర్ సాడిగే రాజ్‌గోపాల్, మంతెన శ్యాంసుందర్, లింగన్న, ఠాకూర్‌గోపాల్‌సింగ్, సాయిని పోచన్న, కొండగట్టు అంజన్న, సతీష్, నాగన్న, వెంకటేశ్ తదితరులున్నారు.

పలుచోట్ల రసాభాసగా గ్రామసభలు

- పేర్లు రాలేదని స్థానికుల ఆందోళన
- జాబితాలో పేర్లు రాని వారు గ్రామ సభలో దరఖాస్తు



ఇచ్చోడ ప్రజాపాలనలో మాట్లాడుతున్న జడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి


గుండాల గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజలింగు

ఇచ్చోడ, జనవరి 22, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న సంక్షేమ పథకాల్లో అర్హుల జాబితాను ప్రకటించేందుకు మండల కేంద్రంతో సహా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభ రసాభాసగా మారింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అనర్హుల పేర్లు వచ్చాయంటూ.. అర్హులైన వారికి రేషన్‌కార్డుల లిస్టులో పేర్లు రాలేదని, ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేర్లు రాలేదని సర్వే చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, అనర్హులకు ప్రభుత్వ పథకాలు ఇస్తున్నారంటూ పలువురు గ్రామసభలో అధికారుల ను నిలదీశారు. మొదటిసారి నిర్వహించిన ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఎక్కడున్నాయి.?..మళ్లీ దరఖాస్తులు చేసుకోవడం దేనికని పలువురు దరఖాస్తుదారులు మండిపడ్డారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు ఎప్పుడు వస్తాయని.. అసలు వస్తాయా అంటూ అధికారులను నిలదీశారు. అలాంటి వాటికి అధికారుల వద్ద సమాధానం లేకపోవడంతో గ్రామసభలో పలువురు మండిపడ్డారు. అనంతరం రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలకు వేళల్లో దరఖాస్తులను అధికారులకు సమర్పించారు.ఈకార్యక్రమంలో జడ్పీసీఈవో జితేందర్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మణ్, ఏఈఓ సంజీవ్ నాయక్, ఈఓ సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడలో నిర్వహించిన వార్డు సభలో కాలనీ వాసులు అధికారులను నిలదీశారు.ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న తమ పేర్లు రాలేదని అధికారులపై మండిపడ్డారు.మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో ఇప్పటికీ మూడు సార్లు చేశామన్నారు. గతంలో ఇచ్చిన వాటి గురించి చెప్పాలని పట్టుపట్టారు. ఇప్పటికే మీ సేవ, ప్రజాపాలన,ఆన్‌లైన్‌లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నామన్నారు.కానీ లిస్టులో తమ పేర్లు లేవన్నారు. అదే విధంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం సర్వేలో విచారించిన లిస్టులో మాత్రం పేర్లు రాలేదన్నారు. ఏదో అధికారులు వచ్చాము.. సభ నిర్వహించామని కాకుండా ప్రజల సమస్యలను పట్టించుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజలను సముదాయించే ప్రయత్నం చేసిన వినలేదు. మరోసారి వార్డు సభలో దరఖాస్తు చేసుకుంటే వచ్చేలా తమవంతుగా కృషి చేస్తామని చెప్పారు.

జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ కమిటీని ఆనంద్‌పూర్ గ్రామస్తులు, నాయకులు, రైతులు మహిళలు ఈజీఎస్ కూలీలు బహిష్కరించారు. రైతు భరోసా, ఎన్ఆర్ ఈజీఎస్ కూలీలకు 300 మంది ఉండగా 13 మందికి అవి భూములు ఉన్న వారికి రూ.12 వేలు చెల్లించడం తగదని గ్రామస్తులు మహాజాన్, సిహెచ్ సుభాష్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాధాసాయినాథ్ వ్యతిరేకించారు. గ్రామ ప్రత్యేక అధికారి వినోద్ దేశ్‌పాండేతో ఎస్సై వి.పురుషోత్తం ముందర గ్రామస్తులు, రైతు కూలీలు వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి మల్లేష్, టీఏ రాకేష్, నాయకులు పరమేశ్వర్, గంబీర్, మాసం నర్సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని నార్నూర్ తహసీల్దార్ రాజలింగు అన్నారు. బుధవారం మండలంలోని గుండాల గ్రామపంచాయతీలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అయిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా,కొత్త రేషన్ కార్డుల కు ఎంపిక కాని వారు ఉంటే మళ్లీ గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ భూమికి మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని, రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, ప్లాట్లు, లే అవుట్లు వంటి భూముల కు వర్తించదని తెలిపారు. అదేవిధంగా నూతన రేషన్ కార్డులు జారీ చేయడం నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భీంపూర్: మండలంలోని గుబిడి పల్లి, గోన, బెల్సరి రాంపూర్, గోముత్రి, తాంసి(కె), కమట్‌వాడ గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి గ్రామ సభలు నిర్వహించారు. నాలుగు పథకాలు సంబంధించి ప్రజలు తమ సందేహాలను అధికారులతో విన్నవించుకున్నారు. పథకాలకు సంబంధించి జాబితాలో పేర్లు లేని వారు ఆందోళనకు గురయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ నలంద ప్రియా, ఎంపీడీఓ గోపాల కృష్ణ రెడ్డి, వెటర్నరీ మండల అధికారి రాథోడ్ సుభాష్, ఎంపీఓ సమీర్ అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఆర్ఐలు రాందాస్, విజయ్, రికార్డు అసిస్టెంట్ పులి స్వామి, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్ సాగర్, ఈసీ నరేందర్ పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలం పరిధిలోని గులాబ్‌తండా, కిన్నర్‌పల్లి, కాండ్లీ, కొల్హారి, చందునాయక్‌తండ, బూతాయి (కె), బోస్రా గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం గ్రామసభలు ప్రశాంతంగ ముగిసాయి. రేషన్‌కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, లబ్దిదారుల జాబితాలను అధికారులు గ్రామ సభలో చదివి వినాపించారు. అర్హులైన లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

- తహసీల్దార్‌కు సన్మానించిన గ్రామస్థులు

మండల తహశీల్దార్ శంకర్‌ను గ్రామస్థులు ఘణంగా సత్కరించారు. బుదవారం మండలం పరిదిలోని భూతాయి(కే) గ్రామపంచాయతీలో గ్రామసభలో పాల్గొన్న ఆయనను గ్రామస్థులు గణంగా సత్కరించారు. ఇంకా కొన్ని రోజుల్లో రిటైర్మంట్ కానున్న తహశీల్దార్‌కు శాలువాతో సత్కరించారు. ఈ కార్యకమంలో అధికారులు వెంకటేష్, నూర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి సాయిశృతి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.